# తిరుప్పావై

## (శ్రీ వ్రతము)

<u>తమిళ తాత్పర్యమునకు</u>

<u>తెలుగు అనువాదము</u>

అనువాద కర్త

క్రిష్ణ శెవ్వాన

తెలుగు అనువాద పర్యవేక్షణ

**జగన్నాధరావు గుండాన**

**THIRUPPAVAI & THIRUPALLANDU IN TELUGU**

First Edition : 2021 - 300 Copies

Translator : Krishna Sevvana

For Copies and Suggestions & Comments

Address : S.R. Krishna Rao
H-303, Aparna Cyber Commune,
Nallagandla, Hyderabad - 500019.
Mobile : 9704655002
E-mail : sevvanakrishna@yahoo.com

Price : Rs. 50/-

మాతా, పితలకు
హృదయ పూర్వక
పాదాభి వందనములు

# ఓం గం గణపతయేనమ:

## గురు స్తుతి

1. గురుర్బ్రహ్మా: గురుర్విష్ణు: గురుర్దేవో మహేశ్వర: గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమ:
2. అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమ:
3. అనువాదము చేయుటకు ఆజ్ఞ ఇచ్చి
శిష్యునిపై తాబేలు వంటి దృష్టి సలిపి,
హిరణ్య గర్భమున పరబ్రహ్మాను దర్శించిన
సాంఖ్యయోగి, మృదుభాషి, మితభాషి,
అన్ని ధర్మముల కన్న గృహస్థాశ్రమమే గొప్పదని చాటి చెప్పి,
తనూ అదే అనుసరించుచున్న

**పూజ్య శ్రీ శ్రీ శ్రీ నిత్యానంద్ గురువుగారికి,**
(కపిల కృష్ణ మఠము, నెం.1 కాట్టావూర్ నల్ల ముత్తువీది,
చూలై–చెన్నై–600112)
హృదయ పూర్వక పాదాభి వందనములు

## దైవ స్తుతి

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
ఎవ్వని యందుడిందు పరమేశ్వరుడెవ్వడు
మూల కారణం బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు
సర్వముతానయైన వాడెవ్వడు వాని నాత్మ
భవునీశ్వరు నేశరణంబు వేడెదన్!!

# <u>అంకితము</u>

తోబుట్టువు, అన్నయ్యగారు,

పితృ సమానులు, రఘురాముడైన,

పూజ్యశ్రీ **కీ॥శే॥ శెవ్వాన నరసింగరావుగారికి**

హృదయ పూర్వక పాదాభి వందనములతో

సవినయ సమర్పణ

# కృతజ్ఞతలు

ఈ పుస్తకము డి.టి.పి. మరియు ప్రచురణకు ఆర్థిక సహాయము చేసిన పుత్రుడు శెవ్వాన సురేంద్రనాథ్ మరియు పుత్రిక శెవ్వాన/ సిద్ధాబత్తుల శోభన వారికి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఆయురారోగ్యములతో సర్వ ఐశ్వర్యములు కలగాలని సర్వ అభీష్టములు నేరవేరాలని శ్రీకృష్ణపరమాత్మున్ని ప్రార్థిస్తున్నాము.

కొన్ని విశేషార్థముల కొరకు ప్రొ॥ అన్నరసు, ప్రొ॥ శక్తిదాసన్, ప్రొ॥ విజయరాఘవాచార్యుల యొక్క తమిళ వివరణలు పరిశీలించబడినవని, వీరికి ఒక్కొక్కరికి విడివిడిగా కృతజ్ఞతా పూర్వక పాదాభివందనములు తెలుపుతూ ఉత్తరములు వ్రాయబడినవని సవినయముగా మనవి చేయుచున్నాము.

సాధారణ తెలుగు పాఠక ప్రజలకు అర్థమగునట్లు వీలైనంతవరకు సంస్కృత పదములు విడనాడి, బహు సులభ శైలిలో తాత్పర్యము ఉండవలెనన్న కోరికతో, ధనుర్మాస వ్రతము నెల్లరునూ తాత్పర్య సహిత అర్థమెరిగి, చదివి, పారాయణము చేసి, ఆచరింపవలెనన్న సదుద్దేశముతో, తమిళము నుండి అనువాదము చేసితిమని తెలుపుతూ. . . .

ఈ పుస్తకములో తెలుగు అనువాద పదములను సరిదిద్దిన అనుభవజ్ఞులు శ్రీ గుండాన జగన్నాధరావు గారికి కృతజ్ఞతా పూర్వక వందనములు సమర్పించుతూ. . . . .

అచ్చు వేయుటకు అనుకూలించి, సకాలములో తెలుగు డిటిపి చేసి సహకరించిన శ్రీ వీరఘుంట రామకృష్ణ – ఎన్ఏడి విశాఖ గారికి హృదయ పూర్వక వందనములు తెలుపుతూ....

ఏవైనా తప్పొప్పులకు ఈ అనువాదకర్తయే కారణమని తెలుపుతూ వాటిని మన్నింప గోరి, పున:ప్రచురణలో చేర్పులు మార్పులు చేసెదమని సవినయముగా తెలుపుచున్నాము.

ఇట్లు
సుధీజన విధేయుడు
**కృష్ణ శెవ్వాన**

# తొలిపలుకు

తిరుప్పావై –శ్రీవ్రతమను నోమును వివాహము కాని కన్యలు తమకు తగిన భర్తను పొందగోరియు, వైవాహిక జీవితము సకల ఐశ్వర్యములతో తులతూగుటకును, తుదకు భక్తి మార్గమనుసరించి పరమాత్ముని బడయగోరుటకును నోచెదరు. ఆ ప్రకారముగానే గోదాదేవి (ఆండాళ్) యీ వ్రతమాచరింపదలచి తాను ఒక గోకుల కన్యగాను, చుట్టూ ఉన్నది కృష్ణుడు పెరిగిన రేపల్లె గాను, తన తోటి కన్యలందరూ గోకుల కన్యలు గాను తలంచి ప్రాత:సమయమున వ్రత మాచరింపదలంచి నిద్ర లేచి స్నానమాచరించి అందరితో కలసి సమూహముగా వెళ్ళి శ్రీమన్నారాయణుని స్తుతించుటకు రమ్మని పిలచి రోజుకొక పాశురము (కీర్తన) చొప్పున ముప్పది రోజులకు 30 కీర్తనలు ధనుర్మాసమున (సూర్యమానం బట్టి ధనుర్మాసమును, చంద్రమానం బట్టి మార్గశిరమును ఏర్పడును. “మాసములలో నేను మార్గశిరమును” అని శ్రీకృష్ణుడన్నట్లు సూర్యుడు ధనుర్రాశిలో ప్రవేశించిన సంక్రమణ ముహూర్తముననే ధనుర్మాసము ప్రారంభమగును). పాడి స్తుతించిన ఈ తిరుప్పావై (శ్రీవ్రతము) వైష్ణవ సంప్రదాయమునకే తలమాణికము వలె వెలసిల్లినది. ఒక్కొక్క పాశురము (కీర్తన) తమిళ ప్రాసలతో నిండినదై, బహురసవత్తమైన రాగ తాళములతో కూడినదిగాను, భక్తి భావన, దైవమునందే శరణు, అంకితములతో నిండినదిగాను, **“నారాయణనే నమక్కుపరై తరువాన్”** నారాయణుడొక్కడే మనకు (ఇహం, పరం అన్నట్లు) పరలోక ప్రాప్తినిచ్చునను వేదాంతర్థములతో నిండినదై, భక్తితోనే భగవత్సాయుజ్యము పొందవలెననియు, ఈ లోకమున ఉద్భవించిన ప్రతి జీవాత్మ పరమాత్మతో కలియవలసినదేనన్న, ఉపనిషత్ సారమును తెలుపునదియు, వీటికంతటికి కావలసినది నిష్కళంక, నిశ్చల మనస్సు, దేవుని యందు అనన్య ప్రేమయే అనియు, భాగవతుల సేవయే భగవంతుని సేవగా బోధించు (నీ పాద కమల సేవయు నీ పాదార్చకుల తోడి నెయ్యము అన్నట్లు) వైష్ణవ సంప్రదాయ సూక్తి రత్నములైన ఈ తిరుప్పావై (శ్రీవ్రతము) ను విశిష్టాద్వైత సిద్ధాంతియగు శ్రీ రామానుజాచార్యులు వారు ప్రతి రోజు అనుసంధించి, ఉదయము భిక్షకు వెళ్ళునపుడు పాడి స్తుతించిరనగా, ఈ 30 కీర్తనలు ఎంత ప్రాముఖ్యత

వహించినవో మాటలతో చెప్పనలవి కాదు.

వైష్ణవ సంప్రదాయములో పన్నెండు ఆళ్వారుల జీవిత గాథలు, వారు శ్రీమన్నారాయణుని పాడి, కీర్తించిన కీర్తనలు బాగా ప్రసిద్ధి చెందినవి. గోదాదేవి (ఆండాళ్) 12 ఆళ్వారులలో ఒక్కరే స్త్రీ మూర్తి. ఆండాళ్ అను పేరుకు అర్థము (ఆండ + ఆళ్) పాలించిన లేక ఉద్ధరించిన వనిత అనియు, ఈమె భూదేవి యొక్క అంశమనియు, ఈమె సీత వలె అయోనిజయనియు చెప్పబడియున్నది. 8వ శతాబ్దమున *శ్రీవిల్లిపుత్తూరులో వైష్ణవ మహాభక్తుడును ఆళ్వారులందరిలో ముఖ్యుడైన 'పెరియాళ్వార్' అను విష్ణుచిత్తునకు తులసి వనములో దొరికిన బిడ్డయే యీ ఆండాళ్.

శ్రీమన్నారాయణునికి ప్రతి దినము సమర్పించు పుష్పమాల కైంకర్యమును తలంచియే విష్ణుచిత్తుడు ఈమెకు 'కొదై' (పూలదండ) అని నామకరణము చేసి, అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసి, అనుదినము శ్రీమన్నారాయణుని గాథలు, అవతార విశేషములు, 108 వైష్ణవ దివ్య దేశ చరిత్రలు, మహిమలు, వివరించి వర్ణించి చెప్పసాగిరి. ఆచార, సంప్రదాయబద్ధుడైన విష్ణుచిత్తుడు ప్రతిదినము తన ఇంటి తులసీ వనము నుండి సేకరించిన తులసీ దళములతో అల్లిన పుష్పమాలను ఆ ఊరి (శ్రీవిల్లిపుత్తూరు) ఆలయ దైవమైన "వటవేశ్వరుని" కి (శ్రీకృష్ణునికి) సమర్పించుతూ ఉండిరి. యుక్త వయస్సుకు వచ్చిన 'కోదై' (గోదాదేవి) తులసీ పుష్పములను దేవునికి, సమర్పించుటకు ముందే తానొక సారి ఆ మాలను ధరించి తన అందమును బావి నీటిలో చూచుకొని సంతసించిన పిదప దానిని దైవమునకు సమర్పించుటకు వెదురు బుట్టలో ఉంచెడిది. ఒక రోజున అకస్మాత్తుగా తండ్రి విష్ణుచిత్తుడు దీనిని చూచి దిగ్భ్రాంతి చెంది దేవునికి అపచారము జరిగినదని తలంచి ఆ రోజు మాలను దైవమునకు సమర్పించుట మానుకొని చాలా చింతించెను. ఆ రోజు రాత్రి స్వప్నమున శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై "అపచారము ఏమియూ జరుగలేదు నాకు సమ్మతమే. ఇకపై ఆమె ధరించి ఇచ్చిన మాలలనే నాకు అలంకరించుము" అని కోరెను.

ఇది తెలుసుకొన్న విష్ణుచిత్తుడు తన బిడ్డ కోదై సాధారణ వనిత కాదనియు దైవత్వము నిండిన స్త్రీ మూర్తి అనియు గ్రహించి మిక్కిలి

ఆనంద భరితుడయ్యెను. అప్పటి నుండి కోదె పేరు "చూడి కొడుత్త నాచ్చియార్" గా ప్రసిద్ధి కెక్కినది. (అనగా: చూడి + కొడుత్తు+నాచ్చియార్ = ధరించి+ఇచ్చిన+వనిత)

క్రమముగా 'కోదె'కు (గోదాదేవికి) శ్రీమన్నారాయణుని పై నున్న భక్తి విశ్వాసములు ప్రేమగా మారి అనురాగ, విరహాలుగా వృద్ధి చెంది తనకు నారాయణుడే భర్త, తాను అతనికే అర్పితమనియు, మరెవరినీ కోరననియు, శ్రీరంగము నందు వెలసిల్లిన శ్రీరంగనాధుడే తన భర్త అనియు, పట్టుబట్టి తనని అచ్చటికి తీసుకు వెళ్లమని తండ్రిని ప్రాధేయపడెను. కలత చెందిన విష్ణుచిత్తునకు ఆ రోజు రాత్రి స్వప్నమున శ్రీరంగనాధుడు ప్రత్యక్షమై, "నా పరివారమును శ్రీవిల్లిపుత్తూరుకు పంపించుచున్నాను. గోదాదేవితో కలిసి అందరూ శ్రీరంగమునకు విచ్చేయండి" అని ఆజ్ఞాపించెను.

శ్రీరంగనాధుడు పంపిన పరివారముతోనే విష్ణుచిత్తుడు, గోదాదేవి సపరివారముగా శ్రీరంగము చేరుకొని, శ్రీరంగనాధుని సన్నిధిని ఆశ్రయించిరి. విష్ణుచిత్తుడు అందరి పెద్దల సమక్షములో గోదాదేవిని శ్రీరంగనాధుని కిచ్చి వివాహము జరిపించెను. పాణిగ్రహణం అనంతరము గోదాదేవి శ్రీరంగనాధుని సన్నిధిలో ప్రవేశించి అందరి సమక్షమున అతనిలో లీనమై, గర్భగృహం నందే అంతర్ధానమైనది. చుట్టూ వున్న వారందరు సంభ్రమాశ్చర్యములలో మునిగియున్న సమయమున ఆకాశవాణి "గోదాదేవి శ్రీమన్నారాయణుని భూదేవి అంశమనియు అందులకే అతని యందు లీనమైనదనియు, విష్ణుచిత్తుడు శ్రీవిల్లిపుత్తూరుకు తిరిగి వెళ్లి సదాచారములు చేసుకొనవలెననియు" పలికెను.

విష్ణుచిత్తుడు, అతని పరివారమంతయూ మహానందభరితులై ఇంతటి దివ్య దర్శనమును గాంచితిమన్న సంతోషముతో శ్రీవిల్లిపుత్తూరుకు వెనుదిరిగిరి.

పెండ్లికి పూర్వము గోదాదేవి ఈ తిరుప్పావై పాశురములతో బాటు 143 విరహ గీతాలు పాడినది. దీనినే "నాచ్చియార్ తిరుమొళి" అని ప్రసిద్ధి గాంచినవి. ఈ గ్రంధములో వచ్చు వివాహ స్వప్న కీర్తనలు "వారణ మాయిరం" అన్నవి నేటికి కూడ తమిళనాడులో ఆలయ స్వామి కల్యాణ, ఉత్సవ, వేడుకలలో భాగవతులు పాడుచున్నారు.

**తిరుప్పావై విశేషార్థము:**
గోదాదేవి మనస్సు శ్రీరంగనాథుని యందే గాఢమైన ప్రేమానుభూతితో పూర్తిగా లీనమై, ఆయనయందే ఐక్యము చెందినది. నారద మహర్షి సూక్తులలో

**"తత్ప్రాప్య త దేవా వలోకవతి,**

**త దేవా శృణోతి, త దేవ భాషయతి**

**తదేవ చింతయతి"** అన్నట్లు అర్థము: ప్రేమ పొందిన మధుర భక్తుడు ప్రేమనే చూచును, ప్రేమనే ఆలకించును, ప్రేమనే వర్ణించును, ప్రేమనే చింతించును. గాఢమైన ప్రేమకు అన్య వస్తువులు ఏవియూ కానరావు. రసమయమైన సర్వత్ర ప్రేమ, ప్రేమ మయుడైన ప్రియతమునే దర్శించును. గాఢమైన భగవద్ప్రేమ, భక్తి ముక్తికి దారి చూపినదను సత్యమునకు ఆండాళ్ జీవిత గాధ ఒక నిదర్శనము. అందులకే ఈ కలియుగమునకు కూడ భక్తి యోగమే శ్రేయస్సు అని ఎందరో మహనీయులు చాటి చెప్పిరి.

భక్తితోనే దేవ సాయుజ్యము సాధ్యమని చాటి చెప్పిన ఈ 'తిరుప్పావై' అను ధనుర్మాస వ్రతము శ్రీవ్రతమును మనమందరము భక్తితో అనుసరించి, పాటించి ముక్తికి మార్గమును సుగమము చేసుకొందుము గాక! "ఆండాళ్" గోదాదేవి మనకందరికి తన ఆశీస్సులతో అనుగ్రహించును గాక! ఇందులకు ఆమె వ్రాసిన మంగళా శాసనమే స్ఫూర్తి.

**శ్రీ ఆండాళ్ తిరువడిగల్ శరణం**

**శ్రీ ఆండాళ్ దివ్యపాదములకు శరణం**

ఇట్లు
సుధీజన విధేయుడు
**కృష్ణ శెవ్వాన**
**(ఎస్.ఆర్.క్రిష్ణారావు)**

CELL NO: 97046 55002
Email ID: sevvanakrishna@yahoo.com

*శ్రీవిల్లి పుత్తూరు తమిళనాడులోని మదురైకి దక్షిణముగా ఉన్న విరుదునగర్ కి – శివకాశీకి మద్య ఉన్న ఊరు. వేటగాళ్ల కులములో పుట్టిన 'మల్లి' అను స్త్రీకి జన్మించిన 'విల్లి', 'కండన్' అను ఇద్దరు కుమారులలో 'కండన్' అనువాడు వేటలో పులి చేత చంపబడెను. 'విల్లి' ఒకనాడు వేట సమయములో పెద్ద వటవృక్షము క్రింద దట్టమైన పొదలో 'పెరుమాళ్ల' విగ్రహమును గాంచి, దానిని బయటకు తీసి ప్రతిష్టించెను. చుట్టూ వున్న ప్రదేశము కొత్త ఊరు వలె తయారై తన పేరునే (పుత్తూరు) శ్రీవిల్లి పుత్తూరుగా మార్చుకొని ప్రసిద్ధి గాంచినది. వటవృక్షము క్రింద వెలసిన స్వామి కనుక 'వటవేశ్వరుడని' (వటపత్రసాయిగా, శ్రీకృష్ణుడుగా) ప్రసిద్ధి చెంది, ఎందరో మహనీయుల జన్మ స్థలముగా మారినది. ఈ దేవాలయ రాజగోపురము 11 అంతస్తులుగా, 96 అడుగుల ఎత్తులో, 11 కలశములతో ప్రతిష్టింప చేసి, తమిళనాడు రాజ్యాంగ చిహ్నముగా ఇప్పటికీ వాడుకలో నున్నది.

# తిరుప్పావై

## స్పందన

"మోక్షసాధన మార్గేషు భక్తిరేవ గరీయసి" నారద మహర్షి తెలిపిన మాట. పరమాత్మను పొందగోరువారికి భక్తిమార్గము శ్రేష్టము. నవవిధ భక్తిమార్గములు భగవంతుని చేరుటకే నిర్దేశించబడినవి. "తిరుప్పావై" (శ్రీవ్రతము) కన్యలు ధనుర్మాసము (మార్గశిరమాసము) తగిన భర్తను-ఐశ్వర్యములను పొందుటకు శ్రీమన్నారాయణుని స్తుతించి ఆచరించు ఈ వ్రతము వైష్ణవ సాంప్రదాయమున మిక్కిలి ప్రశస్తి చెందియున్నది. ఈ వ్రతమును "గోదాదేవి" రోజుకొక పాశురము (కీర్తన) చొప్పున 30 రోజులు స్తుతించి - శ్రీమన్నారాయణుని భర్తగా పొంది అతనిలోనే ఐక్యమయినది. 12 మంది అళ్వారులలో ఏకైక స్త్రీమూర్తి. నారాయణుడొక్కడే మనకు సర్వమనే తత్వాన్ని తన పాశురాల ద్వారా బోధించినది.

గోదాదేవి చరితను "సాహితీసమరాంగణ చక్రవరి"యైన శ్రీకృష్ణదేవరాయలు - తెలుగులో "ఆముక్త మాల్యద"గా (చూడి కొడుత్త నాచ్చియార్) రచించారు.

శ్రీ ఎన్.ఆర్. క్రిష్ణారావు గారు - "పాశురముల" తాత్పర్యములను తెలుగు భాషాభిమానులకు అందించుటకు చేసిన ప్రయత్నము శ్లాఘనీయము గోదాదేవి జీవిత విశేషములను "తొలిపలుకు"లో తెలియపరిచి "తిరుప్పావై" పాశురములను అర్థము చేసుకొని ఆనందిచుటకు మార్గము సుగమము చేసినారు. మృదుభాషి-మిత భాషి-సుమిత్రుడు- శ్రీ ఎస్.ఆర్. క్రిష్ణారావు గారికి శుభాభినందనలు.

"శుభం భూయాత్"

**డా॥ యం.జయంత్ కుమార్**

ఇ-805, అపర్ణ సైబర్ కమ్యూన్, నల్లగండ్ల,

హైదరాబాద్. 500 019.

# తిరుప్పావై

## పరాశర భట్టు ఆశీర్వచనములతో

నీళాతుఙ్గ స్తన గిరి తటీ సుప్త ముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతి శత శిర స్సిద్ధ మధ్యాపయన్తీ
స్వోచ్ఛి ష్టాయాం స్రజి నిగలితం యాబలాత్ కృత్యభుఙ్క్తే
గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏవాస్తు భూయ: ॥

# పాశురములు

పాశురము॥

**అన్నవయల్ పుదువై యాండాళ్ ......... చూడికొడుత్తాల్ చొల్ ॥**

తాత్పర్యము॥

హంస పక్షులతో నిండి, పచ్చటి పొలములతో కూడినదైన కొత్తూరు (శ్రీ విల్లి పుత్తూర్ = శ్రీ విల్లియను వేటగాడు నిర్మించిన కొత్త ఊరు) నందు పుట్టిన ఆండాళ్ పాడి కీర్తించినది ఈ తిరుప్పావై. ఈ పాశురములనబడు కీర్తనలు ఇంపైన రాగ తాళ సంగీతముతో స్వరార్చనగాను, పుష్పమాలలు గాను సమకూర్చి ఇచ్చిన ఆండాళ్ యొక్క గొప్పదనమును కీర్తించుదము గాక!!

పాశురము॥

**సూడి కొడుత్త శుడర్కొడియే!! . . . . . . నాఙ్గడవా వణ్ణమే నల్గు॥**

తాత్పర్యము॥

తులసి మాలలను ముందు నీవు ధరించి అందము చూచుకొన్న తరువాత శ్రీవిల్లి పుత్తూర్‌లో నున్న దైవమునకు (వటపత్రసాయికి అనగా కృష్ణునకు) సమర్పించి, ప్రకాశించుచున్న తీగ వంటి దానా!! ప్రాచీనమైన శ్రీవ్రతమను నోముకు తగిన పాశురములు (కీర్తనలు) పాడి కీర్తించిన దానా!! "తిరువేంగడము లోని దైవమునకు నన్ను సమర్పించుము" అని ఆజ్ఞ ఇచ్చినదానా!! నీ ఆజ్ఞ ప్రకారము మేము ఈ శ్రీవ్రతము నోచుటకు మమ్ము ఆశీర్వదించ కోరుచున్నాము.

పాశురము॥

**మార్గళి త్తింగళ్ మది నిరైందనన్నాళాల్ . . . . . . పారోర్**
**పుగడ్ప్పడిన్దేలో రెంబావాయ్॥ (1)**

తాత్పర్యము॥

సొగసైన ఆభరణములు ధరించి, సిరి సంపదలతో తులతూగు గోకుల కన్యలారా!! మాసములలో శ్రేష్ఠమైన మార్గశిర మాసమిది. పూర్ణ చంద్రునితో గూడిన శుక్ల పక్షమి. మంచిరోజు. ఈ శ్రీవ్రత మాచరించుటకు తగిన ప్రాత:సమయమున స్నాన మాచరింపవలెను కదా!! రండు. పదునైన శూలమును ధరించిన నందగోపుని యొక్క కుమారుడగు కృష్ణుడును, అందమైన కనులు గల యశోద యొక్క సింహకిశోరమును, నీల మేఘశ్యాముడును, ఎర్ర తామర పూరేకుల వంటి కన్నులు గల వాడును, సూర్యుని వంటి ప్రకాశము, చంద్రుని వంటి మోము గల ఆ నారాయణుడే మన (పరై) కోరికలన్నీ తీర్చువాడగును. ఈ లోక ప్రజలందరు మనల్ని కొనియాడునట్లు మనము స్నానమాచరించెదము రండి!!

("నారాయణనే నమక్కు పరై తరువాన్" = "పరై" అన్న పదమునకు డప్పు వాద్యము, డంకా, డోలు అను అర్థములు కొన్ని పుస్తకములలో వ్రాయబడియున్నవి. ఇంత కష్టపడి శ్రీ వ్రతమును ముప్పది రోజులు ఆచరించిన ఆ కన్యలు డప్పు, డంకా వాద్యములు పొందుటకు గాదనియు, దాని వేదాంతార్థము, గూడార్థము బహుమతి, కోరికలు, మంచి భర్తతో గృహస్త జీవితము, సద్గతి లేక మోక్షము ప్రసాదించ కోరుట అనియూ సమయానుసారముగా అర్థము తీసుకొనవలెనని మా మనవి).

పాశురము॥

**వైయత్తు వాళ్ వీర్గాళ్ నాముమ్. . . . . ఉయ్యు మాట్టెణ్ణి**
**ఉగన్దేలో రెంబాయాయ్॥ (2)**

తాత్పర్యము॥

ఈ భువిలో జీవించు భాగ్యవంతులారా॥ మనము శ్రీవ్రతమాచరించుటకు తగిన కృత్యములను వినుడు. ఉషాకాలమున స్నానమాచరించెదము. క్షీర సాగరమున శేష తల్పముపై శయనించి యున్న పరమ పురుషుని

శ్రీమన్నారాయణుని కీర్తించి పాడుదము. అంత వరకు నెయ్యి భుజించము. పాలు త్రాగము. కన్నులకు కాటుక రాసుకొనము. కురులను దువ్వి పుష్పములు ధరించము. చేయకూడని పనులు చేయక, అనర్ధక మాటలు పలుకక, చాడీలు, కొండెములు చెప్పక, ఆర్ధులకు సహాయపడి, తృప్తి పరచి, ఇవన్నియూ ఆత్మోద్ధారణకే అని అనుకొని తృప్తులగుదము రండీ!! (ముందే శ్రీవ్రతము నోచిన అనుభవమున్న వారు కొత్త కన్యలకు బోధించుట.)

<u>పాశురము॥</u>

**ఓంగి ఉలగళన్ద వుత్తమన్ . . . . . . నీఙ్గాద శెల్వమ్**
**నిఱైన్దేలో రెంబావాయ్॥ (3)**

<u>తాత్పర్యము॥</u>

త్రివిక్రముడై ముల్లోకములను తన పాదములతో కొలచిన అనంతుడు, పురుషోత్తముడు ఆ శ్రీమన్నారాయణుడే!! అతని దివ్య నామములను పాడి స్తుతించి, ఈ శ్రీవ్రతమే సరైనదని తలంచి వేకువనే స్నానమాడెదము, రండి! అట్లు స్నానమాచరించుటచే కీడు తొలగి, చాలా శుభములు కలుగును. దేశమంతటా నెలకు మూడు సార్లు వర్షము కురియును. పైరు పంటలు సంవృద్ధి అగును. పంట చేను నీటిలో చేపలు త్రుళ్ళియాడును. పుష్పముల లోని తేనె త్రాగి భ్రమరములు మత్తెక్కి నిద్రించును. పాడి పరిశ్రమ వృద్ధికి అనుకూలముగా ఆవుల పొదుగు నుండి పాలు, నిండుగా వచ్చును. కొదువ లేని సంపదలతో తులతూగును. వ్రత మాచరించెదము రండి!!

(వామన అవతారములో బలి చక్రవర్తి గర్వమును అణచిన ఆ శ్రీమన్నారాయణుడే ఇచ్చట త్రివిక్రముడిగా పిలవబడియున్నాడు)

<u>పాశురము॥</u>

**ఆయ్ మళై కణ్ణా, ఒన్రు, నీ . . . . . . మార్గళి నీరాడ**
**మగిళ్ న్దేలో రెంబావాయ్॥ (4)**

<u>తాత్పర్యము॥</u>

సముద్రము వలె విశాలమైన, గంభీరమైన వాడును వర్షము కురియుటకు

కారకుడవైన ఓ కన్నా!! నీవు నీ విష్ణు మాయతో మమ్ము మరిపించకు! నీవు సముద్రములో మునిగి, నీటిని త్రాగి, గర్జించి, ఆకాశమంతయూ వర్షపు నీటితో నిండిన కారు మేఘముల వలె నల్లని మేఘశ్యాముడవె, బలమైన భుజములు గల పద్మనాభుని చేతిలోని సుదర్శనము వలె మెరుపు మెరసి, మరొక చేతిలోని పాంచజన్యము వలె మిక్కిలి శబ్దముతో ధ్వనించి, "శారంగము" అను విల్లు నుండి దూసుకు వచ్చే బాణముల వలె వర్షపు జల్లులు కురిపించి, లోకులకు సుభిక్షము ఏర్పడునట్లు, ఈ మార్గశిర మాస శ్రీ వ్రత స్నానమాచరించుటకు తగిన రీతిగా వర్షము కురియ జేయవలెనని ప్రార్థించుచున్నాము.

పాశురము॥

**మాయనై మన్ను వడమదురై . . . . . . తీయినిల్**
**తుశాగుమ్ శెప్పేలో రెంబావాయ్॥ (5)**

పాశురము॥

మాయలు చేయుటలో నేర్పరియు, ఉత్తర మధురకు రాజుయూనైన, పుణ్యమైన, విశాలమైన యమునా నదీ తీరమున నివసించు వాడును, గోకులమున అవతరించిన జ్యోతి రత్నమును, కన్న తల్లి దేవకికి, పెంచిన తల్లి యశోదకి వన్నె తెచ్చిన వాడును, "దామోదరుడు" అను పేరు గల శ్రీకృష్ణుని చేరి పరిశుభ్రమైన పూవులు సమర్పించి, నమస్కరించి, నోరారా కీర్తించి మనసారా స్తుతించి పూజించినచో, మనము పూర్వము చేసిన పాప ఫలితములన్నీ నిప్పున పడిన దూది వలె భస్మమై పటాపంచలగును కావున అతని కీర్తిని స్తుతించెదము రండీ!!

పాశురము॥

**పుళ్ళుం శిలంబన్ కాన్ పుళ్ళరై . . . . . ఉళ్ళం**
**పుగున్దు కుళిర్న్దేలో రెంబావాయ్॥ (6)**

తాత్పర్యము॥

ఉదయ కాలమున పక్షులు కూయుచున్నవి. పక్షి రాజగు గరుత్మంతునికి ప్రభువగు శ్రీమన్నారాయణుని ఆలయము నుండి తెల్లని శంఖమును పూరించుటచే వచ్చిన శబ్దమును నీవు వినలేదా? మేలుకొనుము. పూతన

యొక్క విషపూరిత చనుబాలును త్రాగి ఆమె ప్రాణమును హరించిన వాడును, వంచనతో వచ్చిన శకటాసురుని తన చిన్ని పాదములతో నుజ్జు చేసిన వాడును, క్షీర సాగరమున శేష తల్పమున శయనించిన శ్రీమన్నారాయణుడే ప్రపంచములకెల్ల మూల కారకుడు. అటువంటి వానిని మునులు, యోగులు ఎల్లరు మనస్సున స్తుతించి లేచి నిల్చొని "హరీ!" అని పిలుచు శబ్దము మనకూ, వినువారందరికి శ్రవణానందకరమై మనస్సుకు సుఖము గలిగించుచున్నదే!! మేలుకొనుము!
(భగవదనుగ్రహము మరచి నిద్రించుచున్న ఒక గోపికను మేల్కొలుపు పాశురము. ఇచ్చట నుండి వస్తున్న పది పాశురములునూ ఇట్లే వర్ణించబడిన మేలుకొలుపులగును)

పాశురము॥

**కీశుకీ శెన్ఱు ఎజ్గుం ఆనె . . . . . లేశ**
**ముడైయామ్ తిఱవేలో రెంబావాయ్॥ (7)**

తాత్పర్యము॥

కాటుక పిచ్చుక లొక దానితో ఒకటి కీచు, కీచుమని సందడించుచున్నవి, నీవు వినలేదా? దెయ్యము వలె నిద్రించుదానా!! గొల్ల కన్యలు మెడలో హారముల మణుల శబ్దములు, పెరుగు చిలుకు కవ్వముల శబ్దములు నీకు వినబడలేదా? కన్యల కెల్ల నాయికరాలవని పిలవబడుదానా!! శ్రీమన్నారాయణుడే అగు ఈ కేశవమూర్తిని మేము స్తుతించడము విని కూడ నీవు పడక నుండి లేవకున్నావే!! ప్రకాశవంతమైన శరీరము గలదానా!! తలుపులను తెరువుము.
(కేశి అను రక్కసుని కూల్చినవాడు కనుక శ్రీకృష్ణునకు కేశవుడు అను నామము కలిగెను)

పాశురము॥

**కీళ్‌వానమ్ వెళ్ళెన్ఱు ఎరుమై . . . . . ఆవా**
**వెన్ఱారాయ్ అరుళేలో రెంబావాయ్॥ (8)**

తాత్పర్యము॥

తూర్పు తెల్లబడినది. గోవులు తమ తమ శాలలు వీడి పచ్చిక మేయుటకు

వెళ్లిపోయినవి. గోకుల కన్యలు కొందరు శ్రీవ్రత మాచరించ నదీ తీరమునకు వెళ్లిపోయిరి. నిన్ను పిలుచుటకు కొందరి కన్యల తోడుతో వచ్చియున్నాము. లెమ్ము!! (కేశియను) గుఱ్ఱము నోటిని చీల్చిన వాడును, మల్ల యుద్ధమున గొప్ప మల్లులను (చాణూరుడు, ముష్టికుడు) గూల్చిన వాడును, దేవతలకందరికి దేవుడైన ఆ దేవదేవుని నోరారా కీర్తించి, స్తుతించినచో మన కోరికలన్నీ మన్నించి ఆశీర్వదించును. లేచి రావమ్మా॥ (శ్రీకృష్ణావతారములో కంసునిచే పంపబడిన కేశియను రాక్షసుని, మహా మల్లులైన చాణూరుడు, ముష్టికులను మల్ల యుద్ధమున చంపిన ఆ శ్రీకృష్ణుని దేవ దేవునిగా కీర్తించుట)

**తూమణి మాడత్తు చుట్రుం . . . . . నామం**
**పలవుం నవిన్ట్రేలో రెంబావాయ్ (9)**

దివ్య మణులు, రత్నములతో పొదుగబడిన భవనము చుట్టూ దీపాలంకారముతో వెలుగుచుండగా, సుగంధ ద్రవ్యములతో సువాసన వెదజల్లుతుండగా, మెత్తటి పరుపుపై పవళించియున్న మామ కూతురా!! మణులు పొదగబడిన తలుపులు తెరచి బయటికి రావమ్మా!! అత్తగారు!! మీ కూతురిని లేపరాదా! మీ కూతురు మూగదా? లేక చెవిటిదా? గాఢ నిదుర చేయుచున్నదా? లేక మంత్ర ముగ్ధురాలై నిదురలో నున్నదా?

"ఓ! మహామాయలు చేయు మాయగాడా! మాధవుడా! వైకుంఠవాసా" అని పెక్కు నామములతో స్తుతించి పాడితిమి కదా! అత్తా మీ అమ్మాయిని లేవమనండి!!

**నోట్రుచ్చువర్గమ్ పుగుగిన్ట . . . . . తేట్రమామ్**
**వందు తిఱవేలో రెంబావాయ్॥ (10)**

శ్రీవ్రతము నోము నోచి స్వర్గమునకు వెళ్ళుటకు ప్రయత్నించు ఓ అమ్మాయీ!! తలుపులు తెరవకున్ననూ కనీసము జవాబు నైనా చెప్పకూడదా? సువాసనతో నిండిన తులసీ మాలను శిరస్సున దాల్చిన శ్రీమన్నారాయణున్ని మనము స్తుతించుట వలన ఆయన సంతసించి మనల్ని అనుగ్రహించుటకు ఆయుత్తముగా నున్నాడే! మునుపు యముని నోట బడిన కుంభకర్ణుడు తన నిద్రను నీకిచ్చి వెళ్ళెనా? ఏమి గాఢ నిద్ర చేయుచున్నావు!! మాకు గొప్ప ఆభరణము వంటి దానా! లేవుము! లేచి తలుపులను తెరువుము!!

(శ్రీమద్రామాయణములో లంకేశ్వరుడైన రావణాసురుని తమ్ముడు కుంభకర్ణుడు చాలా కాలము నిదురించుటలో ప్రసిద్ధి)

**కట్రుక్కరవై కణజ్గల్ పలకఱందు . . . . . నీ ఎట్రుక్**
**ఉఱంగమ్ పొఱులేలో రెంబావాయ్॥ (11)**

గోకులములో దూడలు గల ఆవుల పొదుగుల నుండి పాలు పితుకు వారును, శత్రువులతో భీకర పోరు సలిపి వారిని నాశనము చేయు సామర్థ్యమున్న వారును, లేశమైన దోషము లేని ప్రజలు గల గోకులములో పుట్టినదానా! బంగారు తీగ వంటి దానా! పుట్టలోని పాము పడగ వంటి విశాల జఘనము గలదానా! అడవిలో స్వేచ్ఛగా తిరుగాడు నెమలి వంటి దానా! మేలుకొనుము. మేము బంధువులగు చెలికత్తెలతో వచ్చి మీ ఇంటి వాకిలి యందు నిలబడి నీలమేఘ శ్యాముని కీర్తించుచున్నామే! నీవు ఇసుమంతైననూ కదలక, జవాబియ్యక నిదురించుచున్నావెందులకు?
(నీల మేఘ శ్యాముడు = నీల మేఘము వంటి శరీరపు రంగు గలవాడు శ్రీకృష్ణుడున్ని కీర్తించుట)

**కనైత్తిలంగ్ కత్తెరుమై కన్ఱు . . . . . అనై**
**త్తిల్లైత్తారుమ్ అరిన్దేలో రెంబావాయ్॥ (12)**

లేగ దూడలు గల గోవులు తమ దూడలను తలంచి నంత మాత్రమున పొదుగు నుండి పాలు స్రవించి వెల్లువలై పారి బురదైన వాకిల్లు గలదియు, ఎందరో సుభిక్షులు గల గోకులములోని శ్రీమంతురాలైన చెల్లీ!! ధనుర్మాసములో మా తలలపై మంచు కురియుచున్ననూ నీ వాకిలి ద్వారమును పట్టుకొని నిలుచున్నాము. దక్షిణ భూభాగమున గల లంకా పట్టణపు అధిపతి రావణాసురుని చంపిన శ్రీరాముని కీర్తిని స్తుతించుచున్నాము. తలుపులు తెరవమ్మా! ఇదేమి గాఢ నిద్ర? నీ వాకిలి యందు నిలబడి నిన్ను మేల్కొలుపుట అన్ని ఇండ్ల వారికి తెలిసిపోయినదే!! ఇకనైన లేచి రమ్మ!!

**పుళ్ళిన్ వాయ్ కీన్దానై . . . . . కళ్లం**
**తవిరన్దు కలన్దేలో రెంబావాయ్॥ (13)**

బకాసురుని నోరు చీల్చిన వాడును, మహా క్రూరుడైన రావణుని గడ్డి పోచ వలె గిల్లి త్రుంచి వేసిన శ్రీరాముని కీర్తిని, శ్రీకృష్ణుని వీరచరితమును

గోకుల కన్యలందరు పాడి శ్రీవ్రతము ఆచరించుటకు వెళ్లిపోయిరి. ఆకాశమున శుక్రుడు ఉదయింప, బృహస్పతి అస్తమించెను. పక్షులు కూయుచున్నవి. చెలీ! ఈ ధనుర్మాస శుభదినములందు నీ కపట నిద్ర నాటకము విడనాడి, నీళ్లలో చక్కగా మునిగి స్నానము చేయక, ఇట్లు నిద్రపోవుట నీకు తగునా?

(శ్రీకృష్ణావతారములో కంసుడు కృష్ణుని వధించుటకు బకాసురుడను రాక్షసుని పంపెను. బకాసురుడు పక్షి రూపము దాల్చి కృష్ణునితో పోరు సలిపి చివరకు కృష్ణునిచే నోరు చీల్చబడి చనిపోయెను)

**ఉంగళ్ పుయయ్ కడె తోట్టత్తు . . . . . పంగయ**
**కణ్ణనై ప్పాడేలో రెంబావాయ్॥ (14)**

మీ ఇంటి పెరటిలోని చిన్న చెరువులో తామర పూవులు వికసించి కలువ రేకులు ముడుచుకొన్నవి. కాషాయ వస్త్రములు ధరించిన, తెల్లనైన శుభ్రమైన దంతములు గల సన్యాసులు తమ తమ ఆలయములకు వెళ్లుతూ శంఖములు పూరించి శబ్దము చేయుటచే ప్రాత: సమయము ఆసన్నమైనదని తెలియుచున్నది. "మిమ్మల్ని నేను వచ్చి మేలుకొలుపుదును" అని డంబములు పలికితివే! ఇప్పుడేమైనది! సిగ్గు లేని నాలుక గల దానా! శంఖ చక్రములను ధరించిన విశాలమైన భుజములు గలవానిని, పంకజాక్షుని స్తుతించి పాడుదము, లెమ్ము!

(శంఖ చక్రములు ధరించిన వాడును, పంకజము (తామర) వంటి కన్నులు గలవాడునైన శ్రీమన్నారాయణున్ని కృష్ణుని రూపమున కీర్తించుట)

**ఎల్లే!! ఇలంగిళియే!! ఇన్నుం . . . . . వల్లానై**
**మాయనై ప్పాడేలో రెంబావాయ్॥ (15)**

"లేవవే! చిలుక పలుకులు పలికే దానా! ఇంకా నిదురించుచున్నావా? "కసిరి, కఠిన మాటలు ఆడకండి, నేనే లేచి వచ్చెదను, ఆగండి" . . . . . "అవును, నీవు మాటకారివే! నీవు నిజమే మాట్లాడుదువని మాకందరికి ముందే తెలుసును" . . . "సరే కాని,
చెలులందరూ వచ్చినారా?". . . . ."అందరూ వచ్చిరి, వచ్చిన వారి నందరిని నీవే లెక్కించి చూచుకొనుము". . . . . మహా బలిష్ఠమైన "కువలయ" మను పేరు గల ఏనుగును వధించిన వాడును, దుష్టులను

సంహరింప గల నేర్పరియూ, మాయ చేష్టలు చేయువాడును అయిన కృష్ణుని స్తుతించి, పాడి శ్రీవ్రత మాచరింప శీఘ్రముగా రమ్ము!!
(మధురా నగరికి శ్రీకృష్ణ బలరాములు ఏతెంచినపుడు, కంసుని వద్ద నున్న "కువలయ" మను మదపుటేనుగును శ్రీకృష్ణుడు సంహరించెను)

**నాయగనాయ్ నిన్ఱ నందగోపనుడయ . . . . . నేశ**
**నిలెక్కదవం నీక్కేలో రెంబాయాయ్॥ (16)**

గోకుల మంతటికి నాయకునిగా వర్ధిల్లు నందగోపుని భవనమును రక్షించువాడా! తీగలు, తోరణములు కట్టిన ద్వారములను కాపాడువాడా! మణులతో నిండిన తలుపుల గడియను తెరువుము. మాయ చేష్టలు చేయువాడును, "మణివణ్ణన్" (నీలమణుల వలె ప్రకాశించు శరీర కాంతి గలవాడును) అయిన శ్రీకృష్ణుడు మన గొల్ల కన్యలకు నిన్ననే తగిన "బహుమతి" ఇచ్చెదనని మాట ఇచ్చెను. అట్టి శ్రీకృష్ణుని మేలుకొలిపి పాడి కీర్తింప, శరీర, మనో శుభ్రతతో వచ్చినారము. మారు మాటాడక శ్రీకృష్ణుని వాకిలి ద్వారములను తెరువుము.

**అంబరమే తణ్ణీరే శోరే. . . . . ఉంబియుమ్**
**నీయుమ్ ఉరంగేలో రెంబావాయ్॥ (17)**

ఆహారము, వస్త్రము, నీరు అను మూడు ముఖ్య ఆవశ్యకములను అందరికి సమకూర్చిన ధర్మాత్ముడు, మహానుభావుడును అగు ఓ నంద గోపాలా! మేలుకొనుము. సుకుమారులు మధుర గాత్రులైన స్త్రీ జాతికంతటికి రత్నము, దీపము వంటి దానా!! యశోదా దేవీ! మేలుకొనుము. భూమి ఆకాశముల మధ్య లోకములను కొలిచిన ఓ వామనా! శ్రీకృష్ణా! నిదుర లేవవయ్యా! ఎఱ్ఱనైన బంగారముతో చేసిన వీర కంకణము, ఆభరణములను ధరించిన ఓ శ్రీమంతుడా! బలరామా! నీవునూ నీ తమ్ముడైన కృష్ణుడునూ ఇంకా నిదురించక, లేవండి! మేలుకొనండి!!
(గోకుల కన్యలు నంద యశోద, కృష్ణ, బలరాములను నలుగురిని స్తుతించి మేలుకొలుపుటకు ప్రయత్నించుట. "వామనా" = మహావిష్ణువు వామన అవతారములో పొట్టి, చిన్న వటువుగా వచ్చి ముల్లోకములను తన పాదముతో కొలచి మహా బలి చక్రవర్తి యొక్క గర్వమును అణచెను)

**ఉన్దు మదగలిత్తన్ ఓడాదతోళ్. . . . . వన్దు**
**తిరనాయ్ మగిన్దేలో రెంబావాయ్॥ (18)**

మదగజములు గలవాడును, చెక్కు చెదరని భుజములు గలవాడునగు నంద గోపుని కోడలా! నీళాదేవి! సుగంధములు వెదజల్లు కురులు గలదానా! తలుపు గడియ తీయవమ్మా! ప్రాత: కాలమున కోళ్లు నలు దిక్కుల కూయుచూ తిరుగుచున్నవి. మాధవీ లత పందిరిపై ఎక్కి కోయిలలు కూయుచున్నవి. ఆట ఆడుటకు బంతిని చేతబూనిన దానా! నీ భర్త కృష్ణుని దివ్య నామములను కీర్తింప వచ్చితిమి. అందము లొలుకు గాజులు చప్పుడు చేయునట్లు, నీ ఎర్ర తామర వంటి సుకుమార అర చేతులతో తలుపులు తెఅవవమ్మా!!

(నీళాదేవి = కృష్ణుని భార్య (నప్పినై పిరాట్టి)

**కుత్తు విళక్కెరియ కోట్టుక్కాల్ కట్టిల్ . . . . . తత్తువ**
**మన్టు తగవేలో రెంబావాయ్ ॥ (19)**

పడక గది యందు దీపములు ప్రకాశించుచుండ, ఏనుగు దంతములతో చెక్కిన నగిషీలు గల మంచముపై, మెత్తటి పంచ శయన మెక్కి, (పంచ విధములైన చల్లదనము, అందము, సువాసన, తెల్లని శుభ్రత, మెత్తదనము గలిగిన శయనము) వికసించిన పూవులను జడలో అమర్చు నీళాదేవి కుచములపై శిరము మోపి నిదురించు ఓ కృష్ణా! నోరు విప్పి మాతో మాట్లాడలేవా?

కాటుక తీర్చిదిద్దిన విశాలమైన నేత్రములు కలదానా! నీళాదేవి! క్షణ కాలమైనను ప్రియుని వీడి యుండలేవా? నీకు ఇది తగదు సుమా! మేమేమీ తత్త్వము భోదించుట లేదు. ఆచరణీయమైనదే చెప్పుచున్నాము.

**ముప్పత్తు మూవర్ అమరర్కు . . . . . ఇప్పోదే**
**ఎమ్మై నీరాట్టేలో రెంబావాయ్ ॥ (20)**

ముప్పది మూడు దేవతలకు రక్షణగా ఉండి, వారి భయమును పోగొట్టి, కాపాడి, శత్రువులకు భయము వణుకు పుట్టించి, వారిని కప్పము కట్టకుండా చూచి రక్షించిన ఓ దేవ దేవా! విమలా! నిదుర లేవవయ్యా! కలశముల వంటి వక్షోజములు, దొండపండు లాంటి ఎర్రనైన పెదవులు, తీగ వంటి నడుము గల ఓ నీళాదేవి! నిదుర నుండి లేవమ్మా! శ్రీవ్రత మాచరించుటకు

ఇప్పుడే విసన కఱ్ఱను, అద్దమును నీ శ్రీవారికి ఇచ్చి స్నానమాచరింప చేసెదవు. లెమ్ము!!

(ముప్పది మూడు దేవతలనబడువారు:- అష్ట వసువులు (8), ఏకాదశ రుద్రులు (11), ద్వాదశ ఆదిత్యులు (12), ఇంద్రుడు(1), ప్రజాపతి (1))

**ఏఱ్ఱ కళంగల్ ఎదిర్ పొంగి మీద లిప్ప . . . . . పోట్రి**
**యామ్ వందోమ్ పుగన్దేలో రెంబావాయ్ ॥ (21)**

అన్ని పాత్రలు పాలతో నిండి పొంగుచున్నవియూ, లెక్కించుటకు సాధ్యము కానన్ని గోవులతో నిండి పాడి సంవృద్ధి గలిగిన గోకుల ప్రభువగు నంద గోపుని కుమారా! ఓ కృష్ణా! మేలుకొనుము. బలము, శౌర్యము గలవాడా! లోకములను రక్షించుటలో శ్రద్ధ గలవాడా! లోక కళ్యాణము కొరకే అవతరించిన ప్రకాశ స్వరూపా! నీ శత్రువులు నీకు భయపడి, ఓడిపోయి, వేరే దారిలేక నీ వాకిలి వద్దకు వచ్చి నీ శరణు పొందునట్లు, మేమందరము కలిసి వచ్చి నీ వాకిలి ముందు నిలబడి నీకు మంగళ స్నాన మాచరింప గోరి స్తుతించి, పాడుచున్నాము.

**అంగన్మా ఞలత్తు అరశర్ అభిమాన . . . . . ఎంగళ్**
**మేల్ సాబమ్ ఇయిన్దేలో రెంబావాయ్॥ (22)**

మహా విశాలమైన ఈ ప్రపంచమును పరిపాలించు ఎందరో మహారాజులు గుమిగూడి, ఒక్కటై, ప్రేమతో నీవు శయనించు మంచము చుట్టూ నిలబడినట్లు, మేమూ నీ ఇంటికి వచ్చి గుమిగూడి నిలబడియున్నాము. వికసించీ, వికసించని తామర పూరేకుల వంటి ఎర్రని కన్నులు గల కృష్ణా! నీ దృష్టి మాపై కొంచెమైనను ప్రసరింపరాదా? చంద్రుడు, సూర్యుడు ఒకేసారి ఉదయించునట్లు, నీ ఇరు కన్నులతో మమ్ము కటాక్షించితివేని మా పాపములన్నియూ పటాపంచలై పోవునే!!

**మారి మలై ముయెంగిల్ మన్ని క్కిడందా . . . . . కార్యం**
**ఆరాయ్న్ద అరుళేలో రెంబావాయ్॥ (23)**

వర్షా కాలమంతయు గుహలోనే నిద్రించి మేలుకొనిన సింహము, అగ్ని కణముల వలె ప్రకాశించు ఎర్రనైన కన్నులు గలదియు, జూలు, వెంట్రుకలు విదిలించుకొని, శరీరపు పట్లు విఱచుకొని, లేచి, గంభీరముగా గర్జించి, మెల్లగా కదిలి వచ్చునట్లు, అతసీ పుష్ప రంగు గల ఓ స్వామీ కృష్ణా!! నీవు

లేచి, నీ భవనమును వీడి వచ్చి శిల్ప సౌందర్యముతో ఒప్పారు సింహాసనముపై కూర్చుండి మేము వచ్చిన కార్యము గురించి అడిగి తెలుసుకొని అనుగ్రహింతువు గాక!!

**అన్రు ఇవ్వులగం అళన్దాయ్! అడిపోట్రి . . . . . ఇన్రు**
**యాం వందోమ్ ఇరంగేలో రెంబావాయ్ ॥ (24)**

మునుపు ఈ లోకమును నీ పాదముతో కొలిచితివి. నీ పాదములకు మంగళమగు గాక! లంకా పట్టణమున కేగి రాక్షసులను సంహరించితివి. నీ సామర్థ్యమునకు మంగళమగు గాక! శకటాసురుని కాలితో తన్ని కూల్చితివి. నీ కీర్తికి మంగళమగు గాక! ఆవు దూడ రూపమున వచ్చిన వానిపై కఱ్ఱ విసిరి చంపిన వాడా! నీ అడుగులు మంగళమయ మగుగాక! గోవర్ధన గిరిని చిటికెన వ్రేలితో పైకెత్తి గోకుల ప్రజలను గోవులను కాపాడిన వాడా! నీ దెవ గుణములకు మంగళమగు గాక! శత్రువులను సమూలముగా హతమొనర్చు నీ చేతిలోని శూలమునకు మంగళమగు గాక! ఈ తీరున నీ కీర్తి, వైభవము, వీరత్వము, ధీరత్వములను కొనియాడి నీ ఆశీస్సులను పొందగోరి వచ్చినారము. అనుగ్రహింపవయ్యా కృష్ణా!
(పై పాశురములో వామనునిగా ముల్లోకములను తన పాదముతో కొలుచుట, రామునిగా లంకా పట్టణమున కేగుట, కృష్ణావతారములో బండి రూపమున వచ్చిన శకటాసురిని తన్నుట, ఆవు దూడ రూపమున వచ్చిన వత్సాసురునిపై కఱ్ఱ విసిరి, కపిత్థాసురునితో (ఫలము రూపమున ఉన్నవానిని) కలిపి వధించుట. గోవర్ధన గిరిని పైకెత్తి గొడుగు వలె పట్టి గోకుల ప్రజలను వర్షము నుండి రక్షించుట వంటి వైభవములను కొనియాడి స్తుతించబడినది.)

**ఒరిత్తి మగనామ్ పిరన్దు, ఓరిరవిల్ . . . . . వరుత్తుం**
**తీర్న్దు మగిన్దేలో రెంబావాయ్ ॥ (25)**

చెరలో నున్న దేవకికి పుత్రుడవై పుట్టి, ఆ రాత్రియే రేపల్లె చేరి యశోదా దేవికి కుమారుడవై దాగి పెరుగుచుండ, దానిని చూచి ఓర్వలేక నీకు కీడు తలపెట్ట నెంచిన కంసుని చెడ్డ తలంపులను, కుట్రలను వమ్ము జేసి తుదకు అతని కడుపు నందు మండుచున్న అగ్ని జ్వాల వలె నిలచితివి. ఆశ్రయించిన వారిని ఆదుకొను ఓ కృష్ణా! దేవా! మా కోరికలు తీర్చి మాకు గొప్ప

సంపదలిచ్చితివేని మేము నీ వైభవములను, కీర్తిని ఎల్లప్పుడూ స్తుతిస్తూ ఏ దు:ఖము లేక సంతోషముగా ఉండెదము సుమా!

**మాలే! మణివణ్ణా! మార్గయ్ నీరాడు వాన్ . . . . . ఆలిన్**
**ఇలయాయ్ అరుళేలో రెంబావాయ్ ॥ (26)**

ఆశ్రయించిన వారిని ఆదుకొను వాడా! నీల మణుల కాంతి వంటి శరీర ప్రకాశము గల వాడా! ధనుర్మాస వ్రతమునకు కావలసిన విధి విధానముల గురించి పూర్వులు చెప్పినవి, ఆచరించినవి, నీకు చెప్పుచున్నాము. లోకములన్నింటిని కంపించునట్లు శబ్దము చేయగల, పాల వన్నె గల నీ పాంచజన్యమును బోలిన శంఖమును పూరించు వారును, పెద్ద మేళ తాళ వాయిద్యములతో నీ కీర్తిని పాడువారును, అందమైన మంగళకరమైన దీపములు, ధ్వజ తోరణములు కావలయును. మర్రి ఆకుపై శయనించిన వాడా! (వటపత్ర సాయి) మాకు పైన చెప్పినవన్నియూ ఇచ్చి అనుగ్రహింపుమా!!

**కూడారై వెల్లుమ్ శీర్ గోవిందా! . . . . . కూడి**
**ఇరుందు కుళిర్ందేలో రెంబావాయ్ ॥ (27)**

దుష్కార్యములు చేయు వారిని దండించు శ్రేష్ఠ గుణము గల గోవిందా! నిన్ను స్తుతించి, పాడి, నీ ఆశీస్సులతో పొందగోరు బహుమతులేవనగా : చేతులకు గాజులు, దండ వంకీలు, చెవికి కుండలములు, పుష్పములు, పాదకటకములు, మరిన్ని ఆభరణములు మేము ధరింతుము. పట్టు వస్త్రములు ధరింతుము. ఆ తరువాత మమ్ములను క్షీరాన్నములో నిండుగా నేయి కలుపుటచే ముంజేతి వరకు నేయి కారునట్లు భుజించి, సంతసించి చల్లబడునట్లు చేసి అనుగ్రహించుమా!!

**కఱవైగళ్ పిన్శెన్రు కావమ్ శేర్న్దు . . . . . ఇఱైవా!**
**నీతారాయ్ పఱై ఏలో రెంబావాయ్ ॥ (28)**

గోవుల వెంట అడవులలో తిరుగువారము. అందరూ కలసి భుజించు వారము. ఏ జ్ఞానము లేక గోకులములో పుట్టిన వారము. నిన్ను మా కులములో (గొల్లకులము) చేరిన వాడుగా పొందుటకు ఏమి పుణ్యము చేసితిమో!! ఏ కొఱతయు లేని గోవిందా!! నీవు సర్వలోక ప్రభువే॥ నీతో మాకు గల సంబంధమును ఎవరూ విడదీయలేరు. లోక జ్ఞానము

కొంచెమైనను లేని బాలలము. నీ మీద ప్రేమ వలన నిన్ను పేరు పెట్టి పిలిచితిమి. అందులకు కోపించక మా కోరికలన్నీ తీర్చి ఓ దేవ దేవా!! ఓ రక్షకా!! మమ్ములను అనుగ్రహింపుము.

(ఆఖరి ఈ రెండు పాశురములు (29, 30) మంగళా శాసనం తరువాత వింజామరంతో వీస్తూ, హారతి ఇస్తూ, తులసీ దళము వేస్తూ చదవవలెనన్నది వైష్ణవ సంప్రదాయం)

**శిత్తుం శిఱుకాలే వందు ఉన్నై సేవిత్తు . . . . . మత్రై**
**అనై కామంగళ్ మాత్తేలో రెంబావాయ్ ॥ (29)**

ఈ ధనుర్మాసమున ప్రాత: కాలమే లేచి వచ్చి నిన్ను సేవించి, స్తుతించి, నీ బంగారు పాదపద్మపు అడుగులను కీర్తించుటలో గలుగు ప్రయోజనమును వినవయ్యా! గొల్ల కులమున అవతరించిన
నీకు మేము చేయు సేవలు, కైంకర్యములను నీవు తప్పక స్వీకరించవలెను. నిన్ను సేవించిన భాగ్యము మేము పొందకుండా ఉండజాలము. ఏ కాలములో నైననూ ఏడేడు జన్మములకును నీ యందే మనసు నిలిపి నీతోనే బంధుత్వము పొందగోరుచున్నాము. నీకు సేవకులమై యుందుము గాక!! మాకు ఏవైనా ఇతర ఆశలు, చపల చిత్తము గలిగిన యెడల, వాటిని నీవే నివృత్తి చేసి మమ్ములను అనుగ్రహించవయ్యా! గోవిందా!! (అన్య మనస్సు లేక దేవుని యందే పూర్తి శరణాగతి పొందుట)

**వంగకడలై కడైంద మాధవనై, కేశవనై . . . . . ఎంగుమ్**
**తిరువరుళ్ పెత్రు ఇన్బుఅవ రెంబావాయ్॥ (30)**

క్షీర సాగరమును మధించి దేవతలకు అమృత మొసంగిన మాధవుని, కేశవుని, పూర్ణ చంద్రుని వంటి ముఖములు గలిగిన గోకుల కన్యలు కీర్తించి స్తుతించి ఆశీర్వాదములు పొందిరి. ఈ దివ్య చరితమును శ్రీవిల్లిపుత్తూరు నందు అవతరించినదియు, మంగళకరమైన తామర పుష్పముల మాలను ధరించిన శ్రీ విష్ణుచిత్తుల కుమారైయగు శ్రీ గోదాదేవి శబ్ద అర్థములతో రాగ తాళ రసభరితములైన ఈ ముప్పది పాశురములలో (కీర్తనలలో) వివరించెను. (ఇవియే శ్రీవ్రత సూక్తములు, ధనుర్మాస వ్రత

పాశురములు, తిరుప్పావై అనియు వివిధ నామములతో నొప్పారినవి) వీటిని విడువక నియమముతో పాడి, స్తుతించు వారు, ఎత్తైన పర్వతముల వంటి నాలుగు భుజములు, ఎఱ్ఱనైన కన్నులు, లక్ష్మీ కటాక్షము కలిగిన ముఖము గల వాడును, క్షయము లేని సర్వైశ్వర్యములు గలవాడునైన లక్ష్మీ పతి యగు శ్రీమన్నారాయణుని వలన సాటిలేని కృపకు పాత్రులై బ్రహ్మానందము పొంది వృద్ధి పొందుదురు గాక!

**శ్రీ ఆండాళ్ తిరువడిగళ్ శరణం**

**(శ్రీ గోదాదేవి దివ్యపాదములే శరణు)**

**– శ్రీ వ్రతమను ధనుర్మాస వ్రతం సంపూర్ణం**

**శ్రీకృష్ణపరమాత్మనే నమః**

**శుభం భూయాత్**

# పెరియ (పెద్ద) జీయర్ - శాత్తుముఱై
# (అలంకారోపచారము)

1) కోదై పిఱన్దవూర్ గోవిన్దన్ వాయుమూర్
శోదిమణి మాడమ్ తోన్టుమూర్ - నీదియాల్
నల్లబత్తర్ వాయుమూర్, నాన్మఱైగ ళోదుమూర్
విల్లిపుత్తూర్ వేదక్కో నూర్
పాద గంగళ్ తీర్కుమ్ పరమ నడి కాట్టుమ్
వేద మనైత్తు క్కుమ్ విత్తాగుమ్ - కోదై తమిళ్
ఐయైన్దు మైన్దుమ్ అఱియాద మానిడరై
వైయమ్ శుమప్పదుమ్ వంబు॥

2) తిరువాడి ప్పూరిత్తిల్ శెగత్తు దిత్తాళ్ వాయిగే
తిరుప్పావై ముప్పదుమ్ శెప్పినాళ్ వాయిగే
పెరియాళ్వార్ పెఱ్ఱెడుత్త పెన్ పిళ్ళై వాయిగే
ఒరునూత్తు నార్పత్తు మూన్టు ఉరైత్తాళ్ వాయిగే
ఉయర్ రంగేర్కే గన్ని యుగందళిత్తాల్ వాయిగే
మరువారుమ్ తీరుమల్లి వలనాడి వాయిగే
వణ్ పుదువై నగర్ కోదై మలర్ పదంగళ్ వాయిగే
శ్రీ మదాండాళ్ దివ్య తిరువడిగళే శరణమ్॥

(అని స్తుతించి సాష్టాంగ దండ ప్రణామములు చేసి తీర్ధ ప్రసాదములు స్వీకరించవలెను)

**తాత్ప॥(1)**

గోదాదేవి జన్మించిన ఊరును, గోవిందుడు నివసించు ఊరును, జ్యోతిరత్నము ఉత్పన్నమైన ఊరును, నీతిమంతుడైన (బట్టర్) బట్టు జీవించిన ఊరునూ, నాలుగు వేదములు పారాయణము చేయబడు ఊరైన విల్లిపుత్తూర్ వేదములతో నిండినదియు, సకల పాపములను పోగొట్టునదియు, పరమాత్ముని పాదపద్మములను చూపునదియు, వేదములన్నింటికి విత్తనము వంటిదియునైన, గోదాదేవి యొక్క తిరుప్పావై (శ్రీవ్రతము నోము) ను నేర్చి ఆచరించని మానవుడు భూమికి భారమే అగును.

**తాత్ప॥ (2)**

ఆషాఢ మాసమున, పుబ్బా నక్షత్రము నందు జన్మించిన ఆండాళ్ వర్ధిల్లు గాక!

"తిరుప్పావై" అను ముప్పది పాశురములను పాడిన వనితా – వర్ధిల్లు గాక!

"పెరియాళ్వార్" అను విష్ణుచిత్తునకు (తులసీ వనము నందు) దొరికిన ఓ బిడ్డా – వర్ధిల్లు గాక!

"శ్రీపెరంబుదూర్" మహా మునియైన శ్రీరామనుజాచార్యులు గారి చెల్లెలా – వర్ధిల్లు గాక!

నూట నలువది మూడు పద్యములు (నాచ్చియార్ తిరుమొయి) పాడిన వనితా – వర్ధిల్లు గాక!

తాను ధరించిన మాలను పెరుమాళ్ళకు కోరి సమర్పించిన వనితా – వర్ధిల్లు గాక!

వేటగాళ్ల కులమునకు చెందిన మల్లి (విల్లి, కండన్ వేటగాళ్ల యొక్క తల్లి) వలన ప్రసిద్ధి చెందిన ప్రదేశమును, విల్లి వలన పునరుద్ధరించబడిన కొత్త ఊరు శ్రీ విల్లి పుత్తూర్ లో అవతరించిన వనిత ఆండాళ్ పాద పద్మములు వర్ధిల్లు గాక!

(శ్రీ రామనుజాచార్యులకు ముందు శతాబ్దములలో ఆండాళ్ జన్మించినను వైష్ణవ సంప్రదాయుము ప్రకారము ఆమె అతనికి చెల్లెలుగా పిలవబడుచున్నది.)

**శ్రీ ఆండాళ్ దివ్య పాదములే శరణం**

# తిరుపల్లాండు

వైష్ణవ సంప్రదాయములోని పన్నెండు మంది ఆళ్వారులలో ఇద్దరు శ్రీ విల్లి పుత్తూరుకు చెందిన విష్ణు చిత్తుడు, ఆండాళ్ వీరు తండ్రి కూతుళ్లు. విష్ణుచిత్తునకు "శ్రీపెరియాళ్వార్" అన్న పేరు కూడ యున్నది. చారిత్రకముగా విష్ణుచిత్తుడు 8వ శతాబ్ధమునకు చెందిన వారు గాను, ఆళ్వార్లందరికి పెద్ద వానిగా పెరియాళ్వార్ (పెరియ అనగా 'పెద్ద' అని అర్ధము) గా కీర్తించబడిరి. విష్ణుచిత్తుడు 'తిరుప్పల్లాండు', 'పెరియ తిరుమొళి' అను రచనలు చేసినారు. ఇతనికి పాండ్యరాజ సభలో జరిగిన సన్మాన కార్యక్రమములో, భగవానుడైన పెరుమాళ్లు (శ్రీమన్నారాయణుడు) సపరివారముగా విచ్చేసి తిలకిస్తారు. విష్ణుచిత్తుడు మహానందభరితుడై భగవానుడైన పెరుమాళ్లుకు "తిరుపల్లాండు" (మంగళాశాసనం) పాడుతారు. అవే ఈ 12 పద్య కీర్తనలు. మిక్కిలి రసవంతమైనవి గాను, రాగ తాళములతో కూడినవైన ఈ పద్యములు వైష్ణవ సంప్రదాయములో కెల్ల అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నవి.

వైష్ణవ తత్త్వము పొందగోరు వారందరు ఈ "తిరుపల్లాండు" చదివి తీరవలసినదే. వైష్ణవ సంప్రదాయములో "నాలాయిర దివ్య ప్రబంధము" (నాలుగు వేల దివ్య పద్యముల కూర్పు) ఒక మహా గ్రంధము. చాలా శ్రేష్ఠమైనది. "నాలాయిర దివ్య ప్రబంధమునకు ముందునూ, వెనకనూ ఈ విష్ణుచిత్తుడు వ్రాసిన "తిరుపల్లాండు" ను భాగవతులు, ఆలయ పురోహితులు చదువుతారనగా, దీనికి ఎంత ప్రాముఖ్యమో చెప్పనలవి కాదు.

వేదాధ్యయమునకు ముందు 'ఓం' కారము ఎట్లు ముఖ్యమో అట్లే 'నాలాయిర దివ్య ప్రబంధము"నకు ముందు, వెనుక ఈ "తిరుపల్లాండు శ్రీమన్నారాయణుని యొక్క అష్టాక్షరీ మూల మంత్రముతో కూడినదైనందువలన దీనికి మరింత ప్రాముఖ్యత సంతరించుకొనెను.

తమిళములో తిరుపల్లాండు అనగా

తిరు + పల + ఆండు = (సంధి) 'తిరుపల్లాండు'

అర్ధము : దివ్య + చాలా + సంవత్సరములు (లేక) కలకాలము

అర్ధము = చాలా కాలము వర్ధిల్లు గాక! అను మాట 'తిరు' అన్న

పదము శ్రీవలె మర్యాద సూచిక లేక దివ్య, మంగళమైన, పవిత్రత, అను అర్ధము సూచించునది.

ప్రతి పద్యము చివర పల్లాండు! పల్లాండు! అను పదములతో ముగుస్తుంది. అంటే చాలా కాలము నీవు వర్ధిల్లు గాక! అని కోరుకొనుట. లెక్కలేనన్ని మహిమలతో దైవము శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ, ధర్మస్థాపన, రక్షణ కొరకు ఎన్నో అవతారములు ఎత్తి సాధు, సత్వ జనులను రక్షించి, దుష్టులను సంహరించి, అనుగ్రహించుటచే భక్తుడు దైవమును నీవు చాలా కాలము ఉండి వర్ధిల్లి మమ్ములను రక్షింతువు గాక! అని వేడుకొనుట.

ఇక తిరుపల్లాండు పద్య తాత్పర్యములు:-

## <u>పెరియాళ్వార్ రచించిన తిరుప్పల్లాండు</u>

## తనియన్‌లు: నాదముని ఆశీర్వదించినది:-

గురు ముఖ మన ధీత్వ ప్రాహ వేదాన శేషాన్
నరపతి పరిక్లుప్తం శుల్క మాదాతు కామ:
శ్వశుర మమర వంధ్యం రంగ నాథస్వ సాక్షాత్
ద్విజ కుల తిలకం తం విష్ణు చిత్తం నమామి॥

మిన్నార్ తడ మదిల్ శూమ్ విల్లి పుత్తూర్‌న్రొరుకాల్
శొన్నార్ కయర్ కమలం శూడినోమ్ మున్నాళ్
కియియఱుత్తా నెన్రై రుత్తోమ్ కీయిమై ఇడి శేరుం
వయి యఱుత్తోమ్ నెంజమే వందు

పాండియన్ కొండాడ ప్పట్టర్ పిరాన్ వన్దా నెన్రు
ఈండియ సంగ మెడుత్తూద - వేండియ
వేదంగ లొది విరెందు కియి అఱుత్తాన్
పాదంగళ్ యామ్ముడైయ పఱ్ఱు.

- - -

శ్లోక॥ **పల్లాండు పల్లాండు పల్లాయి రత్తాండు**
**పల కోడి నూరాయిరమ్,**
**మల్లాండ తిందోళ్ మణి వన్నా! ఉన్**
**శేవడి శెవ్వి తిరుకాప్పు (1)**

తాత్పు॥ ముష్టికుడు, చాణూరుడు మొదలగు మల్ల యుద్ధ వీరులను జయించి మాకు జయమును సాధించి ఇచ్చిన మహా భుజ పరాక్రమము గలవాడా! నీల మాణిక్య మణుల వంటి రంగు గల శరీరము గల వాడా! ఎర్ర తామర పూవుల వంటి నీ దివ్య పాదములే మాకు శరణు, కాబట్టి, నీవు కొన్ని వేల కోట్ల సంవత్సరములు జీవించి వర్ధిల్లు గాక!
(ఇచ్చట విశేషమేమనగా భక్తుడు భక్తి పరవశముతో, దివ్యానుభూతితో పెరుమాళ్లను (శ్రీమన్నారాయణుని) స్తుతించి పొగడి పాడి అతడు భక్తులకు ఎల్లప్పుడూ రక్షణగా ఉండవలెనన్న కోరికతో అతడు కొన్ని వేల కోట్ల సంవత్సరములు జీవించి వర్ధిల్లు గాక! అని వేడుకొనుట)

శ్లోక॥ **ఆడియో మోడుం నిన్నోడుం . . . . . పడైప్పోర్క్కు**
**ముళంగు అప్పాంచజన్యమ్ పల్లాండే॥ (2)**

తాత్పు॥ నీ దాసులము, నీ ఆశ్రితులము, మమ్ములను పరిపాలించు వాడవైన నీకు మాతో ఎటువంటి చీలికలు లేకుండా మన బాంధవ్యము వేయి సం॥ నిలచి ఉండు గాక! నీ వక్ష స్థలములో కుడి భాగమును ఆక్రమించి యున్న వనిత శ్రీదేవియూ నిన్ను ఎన్నడూ వీడక నీతోనే ఉండు గాక! నీ కుడి చేతియందు ప్రకాశించుచున్న "సుదర్శన చక్రము" నిర్విరామంగా తిరుగుతూ ఉండి వర్ధిల్లు గాక! యుద్ధ సమయమున నీవు పూరించి విజయ భేరి మ్రోగించు ఆ "పాంచ జన్యము" శాశ్వతముగా ఉండి వర్ధిల్లు గాక!

శ్లోక॥ **వాయాట్పుట్టు నింద్రీరుల్ రేల్ వందు . . . . . పాయాళా**
**గప్పడై పొరుదానుక్కు పల్లాండు కూఱుదుమ్॥ (3)**

తాత్పు॥ పెరుమాళ్‌కు సేవ చేయుటకు, సద్గతి పొందుటకు ఉన్నత

ఆశయమున్న వారందరు కలసి, ఈ శుభ దినమున రేగడి మట్టి మోయుటకు రండి! కేవలము ఉదర పోషణ కొరకు ఇతరుల వద్ద బానిసలుగా పని చేయు వారిని మన పక్షమున చేర్చుకొనజాలము. మేమందరము సదాచారములతో ఏడేడు జన్మల నుండి ఏ తప్పూ చేయక ఉన్న వారము. రాక్షసులు జీవించు లంకా పురిని నాశనము చేయ నిశ్చయించి, అచ్చటకు సైన్య బలమును పంపిన ఆ పెరుమాళ్లు (శ్రీరాముడు) వర్ధిల్లు గాక! అని చెప్పుదుమే !!

శ్లోక॥ **ఏడు నిలత్తిల్ ఇడువదన్ మున్నం వందు . . . . . పాడు మనముడై ప్పుత్తురులీర్ వందు పల్లాండు కూరుమినే॥ (4)**

తాత్ప॥ మా పక్షమున జేరి మహానందము పొంద గోరు వారు, మీ శరీరము నశించి స్మశానమునకు కొని పోవుటకు ముందే మాతో వచ్చి చేరిపోండి! కైవల్య సుఖము పొందగోరు వారు ఎల్లలు దాటక ముందే, ఆలస్యము చేయక వెంటనే మాతో చేరిపోండి! దేశము, నగరము గుర్తించునట్లు భగవానుని అష్టాక్షరి మంత్రమైన "ఓం నమో నారాయణాయ" మంత్రమును బాగా పఠించి, మాతో కలసి "ఎంబెరుమాన్" (ఆ పెరుమాళ్ల్) వర్ధిల్లు గాక! అని చెప్పదమే!!

శ్లోక॥ **అండ కులత్తుక్కు అధిపతి యాగి . . . . . పండై కులత్తు తవిర్త్తు పల్లాండు పల్లాయిరత్తాండు ఎన్మినే ॥ (5)**

తాత్ప॥ ప్రపంచ మానవ జాతికే అధిపతియైన వాడును వారిని సృష్టించు వాడును అయిన భగవానుడు దట్టమైన విష పొదల వలె మొలకెత్తిన రాక్షస సమూహమును కూకటి వేళ్లతో పెకలించి వేసినట్లు నాశనము చేసిన వాడును, ఇంద్రియములకు అధిపతిగా ఉన్నవాడును, ఈ ప్రపంచమును రక్షించుచున్న కేశవుడైన భగవానునకు సేవ చేయు సేవకుల సమూహములో ఉన్నవారా! మీరందరు మా పక్షమున చేరి పెరుమాళ్ల దివ్య పాదములను దర్శించుదురు గాక! ఫలితమును ఎదురుచూచు తత్వమును, గొప్ప కులములో జన్మించితిమన్న గర్వమును వీడి, భగవానుడైన

పెరుమాళ్ల సహస్ర నామములను ఎడతెరిపి లేక పాడి స్తుతించి, ప్రభూ వర్ధిల్లు గాక! అని పాడెదము!

**శ్లోక॥ ఎందై తందై, తందై, తందై తమ్ మూత్తప్పన్ . . . . . బందనై తీర పల్లాండు పల్లాయురత్తాండెద్రు పాడుదుమే॥ (6)**

తాత్ప॥ మేము, మా తండ్రి, తాతలు, ముత్తాతలు వారి తండ్రులు, తాతలు అన్నట్లు ఏడు తరముల వారిగా మొదలెట్టి మంచి తరుణముతో వచ్చి మేము అనుసరణ, ఆచరణ తప్పకుండా భగవంతునికి సేవ చేయుచున్నాము. "తిరువోనం" శుభదినమున అందమైన సంధ్యా సమయమున నరసింహ పెరుమాళ్లు అవతారము ఎత్తి రాజ భవన స్తంభములో ప్రత్యక్షమై హిరణ్యకశిపుని సంహారము చేసిన ఆ పెరుమాళ్లకు మనో వ్యధ తీర్చ గోరి స్తుతించి ఎన్నో సంవత్సరములు వర్ధిల్లమని పాడుదామే!!

("తిరువోనం" ఒక నక్షత్ర దినము. అనగా "శ్రవణ" నక్షత్రము నందు జన్మమెత్తిన ఉగ్ర నరసింహుడు, మహావిష్ణువు యొక్క దశావతారములలో నాల్గవదైన ఈ నరసింహ అవతారము, అవతారములలో కెల్ల అతి తక్కువ సమయమైన, కొన్ని నిముషములే గల ఈ అవతారము వైష్ణవులకు చాలా శ్రేష్ఠం. అవతార జన్మ, స్థితి, లయములన్నియూ 32 నిముషములలోనే జరిగిపోయినవి.

**శ్లోక॥ తీయిర్ పొళిగిన్ర శెంజుడర్ ఆయి . . . . . పాయి చుయిట్రియ ఆయి వల్లానుక్కు పల్లాండు కూరుదుమే॥ (7)**

తాత్ప॥ అగ్ని కణముల వలె ఎర్రగా ప్రజ్వలించు సుదర్శన చక్ర రవ్వలతో మేము గుర్తులేర్పరచుకొన్నవారము. అదియున గాక తరతరాలుగా పెరుమాళ్లను వదలకుండా అతనికి సేవ చేస్తూ వస్తున్నాము. కుట్ర, వంచనలతో కూడిన సైన్యముతో వచ్చి ఎదిరించిన వర్ణాసురుని యొక్క వేయి భుజములను నరికి రక్తాన్ని ప్రవహింప జేసిన ఆ పెరుమాళ్లు వర్ధిల్లు గాక! అని పాడుదామే!!

శ్లోక॥ **నెయ్యిడై నల్లదోర్ శోరుమ్ . . . . . పెయుడై**
**నాగప్పగై కొడియానుక్కు పల్లాండు కూరువనే॥ (8)**

తాత్ప॥ దాసుడనైన నాకు నెయ్యి కలిపిన అన్నము, దగ్గర నుండి ఉపచారము చేయు సేవయూ, తాంబూలమునూ, కంఠ ఆభరణములనూ, చెవికి కుండలములనూ, శరీరముపై రాసుకొనుటకు సువాసనలు వెదజల్లే చందనమునూ నాకిచ్చి భగవానుడు నన్ను వశపరుచుకున్నాడు. అదియును గాక, నన్ను పవిత్రమైన సత్వ గుణము గలవానిగా మార్చి వేసెను. పడగ విప్పి నాట్యమాడు సర్పమునకు విరోధియగు గరుత్మంతుడు తనకు వాహనముగా గలిగిన ఓ పవిత్రుడా వర్ధిల్లు గాక! అని దీవించి పాడుదము.

శ్లోక॥ **ఉడుత్త కలైంద నిన్ పీదగ ఆడై . . . . . నాగనై**
**పల్లికొండానుక్కు పల్లాండు కూరుదుమే!**
**(9)**

తాత్ప॥ భగవానుడా! నీవు ధరించి, విప్పి, విడచిన పీతాంబరమును పట్టు వస్త్రమును మేము ధరించుకొందుము. నీవు భుజించిన పళ్లెములో మిగిల్చిన అన్నమును మేము భుజించెదము. నీ మీద అలంకరించిన తరువాత తీసివేసిన తులసీమాలలను మేము ధరించెదము. మేము "తిరువోనం" తిరునాళ్లలో మాకు నాలుగు దిశల్లోనూ నిర్ణయించబడిన సేవలను చేసెదము. పడవ విప్పి ఆడు ఆదిశేషుని మెత్తటి శరీరముపై పవళించిన ఆ పెరుమాళ్లు వర్ధిల్లు గాక! అని పాడుదము.

శ్లోక॥ **ఎన్నాళ్ ఎంబెరుమాన్ ఉన్దనక్కు ఆడి . . . . . నాగ**
**తలై పాయిన్దవనే! ఉన్నై పల్లాండు కూరుదుమే!!**
**(10)**

తాత్ప॥ భగవానుడా! మేము నీకు దాసులమని రాసిచ్చిన మొదటి రోజు నుండే మా వంశ పూర్వీకులందరూ నీకు దాసాను దాసులైతిరి. కైవల్యము నుండి దూరమై కైంకర్యములోనే నిమగ్నులమైన వారము.

ఈ దివ్య "తిరువోనం" శుభదినమున అవతరించి, ఉత్తర మధురా నగరి కంసుని సైన్యమును ఛేదించి అతని ధనుస్సును విరచిన వాడును, ఐదు తలలు గలిగిన "కాళింగుడు" అను సర్పము తలపై కెక్కి నాట్యమాడిన వాడును నీవే కదా! ఓ ప్రభూ!! నీ సాహసములను స్తుతించి నీవు వర్ధిల్లు గాక! అని పాడుచున్నాము.

శ్లోక॥ **అల్వయక్కు ఒంఱ్రు మిల్లా అనికొట్టియర్ . . . . . పవిత్రనే! ఉన్నై పల్లాండు కూరువనే॥ (11)**

తాత్ప॥ భగవానుడా! తిరుకొట్టియూరు నాయకునిగా వర్ధిల్లు "శెల్వనంభి" ఎటువంటి తప్పులు చేయని వాడు, నిన్నే శరణు పొంది అభిమానించు వాడు. అటువంటి పురాతన వైష్ణవ సంప్రదాయమునకు తల మాణిక్యం వంటి వాడైన "శెల్వనంభి" వలె నేనూ మిమ్ములను పూర్వాపరములైన ఆచారములతో సేవలు చేసిన వాడినే. నేను ఎటువంటి లాభమును ఉపేక్షింపక, దృఢ మనస్సుతో 'నమో నారాయణా!' అని ఎల్లప్పుడూ నీ దివ్య నామమునే స్మరించుతూ ఉన్నవాడును. అన్ని విధములైన పవిత్రతలు గల ఓ భగవానుడా! నీవు వర్ధిల్లు గాక! అని పాడెదను. (వైష్ణవ 108 దివ్య క్షేత్రములలో, ప్రసిద్ధి గాంచిన "తిరుకొట్టియూరు" దేవాలయము తమిళనాడులోని తిరుచ్చికి 70 కి.మీ. దూరములో లేక కారైకుడి నుండి 14 కి.మీలో వెలసిల్లిన అతి పురాతన వైష్ణవ క్షేత్రము. అందు వైష్ణవ పరమ భక్తుడైన "శెల్వనంభికి" చిన్న సన్నిధి గలదు.)

శ్లోక॥ **పల్లాండెంఱ్రు పవిత్ర నై పరమేట్టియై శారంగం . . . . . పల్లాండుం పరమాత్మనై సూందిరుందు ఏత్తువర్ పల్లాండే ॥(12)**

తాత్ప॥ ఎంబెరుమాన్ (పెరుమాళ్లు) ఎల్లప్పుడూ పవిత్ర స్వరూపమే! వైకుంఠములో వెలసిల్లి, శారంగము అను ధనస్సును సంధింప నేర్పరియైన వాడును, శ్రీవిల్లిపుత్తూర్‌లో అవతరించిన విష్ణుచిత్తుడు (పెరియాళ్వార్) అమితానందముతో పాడి కీర్తించిన వాడును, భగవానుడైన పెరుమాళ్లు అన్ని కాలములలోనూ శ్రేష్ఠముగా

వర్ధిల్లవలెనను కాంక్షతో పాడిన ఈ "పల్లాండు" (వర్ధిల్లు గాక!) అన్న కీర్తనలు "ఓం నమో నారాయణాయ" అన్న దివ్య మంత్రముతో కీర్తించిన వారగుదురు. అదియును గాక శ్రీమన్నారాయణుని లెక్కలేనన్ని "పల్లాండు" లు (వర్ధిల్లు గాక!) చుట్టూ నిలబడి "దివ్య పల్లాండు"లు కీర్తించిన వారగుదురు.

పెరియాళ్వార్ దివ్య పాదములకు శరణం

పెరియాళ్వార్ దివ్య పాదములకు శరణం

పెరియాళ్వార్ దివ్య పాదములకు శరణం

ఓం నమో నారాయణాయ

***